## క్లుప్తంగా

### న్యాయమూర్తి బాధ్యతల స్వీకరణ


కృష్ణవంశి

పుంగనూరు: పట్టణ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జిగా కె.కృష్ణవంశి బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. విజయనగరానికి చెందిన కృష్ణవంశి తొలి సారిగా పుంగనూరు న్యాయమూర్తిగా నియమించడంతో ఆయనకు సిబ్బంది , న్యాయవాదులు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా న్యాయమూర్తి కృష్ణవంశి న్యాయవాదుల సంఘ కార్యాలయంలో సమావేశమయ్యారు. కేసుల పరిష్కారానికి సహకరించాలని కోరారు.

### 2న రక్తదాన శిబిరం

పుంగనూరు: పట్టణంలోని అన్ని ప్రభుత్వ శాఖల సహకారంతో సెప్టెంబర్ 2న రక్తదాన శిబిరం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం కమిషనర్ నరసింహ ప్రసాద్, వైద్య సిబ్బంది, రెవెన్యూ, ఎంపీఐ, సబ్‌రిజిస్ట్రార్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, శుభరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వారి సహకారంతో స్థానిక బీఎంఎస్ క్లబ్‌లో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. శిబిరానికి అధిక సంఖ్యలో రక్తదాతలు హాజరై రక్తదానం చేయాలని కోరారు.

### రెండు ఇసుక టిప్పర్ల సీజ్


పోలీసులు సీజ్ చేసిన ఇసుక టిప్పర్లు

పెద్దపంజాణి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను బుధవారం సీజ్ చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ సహదేవి తెలిపారు. మండలంలోని శంకర్రాయలపేట గ్రామ సమీపంలోని డంపింగ్ నుంచి రెండు టిప్పర్లలో ఇసుకను పుంగనూరు వైపు తరలిస్తున్నారనే సమాచారంతో సిబ్బందితో కలసి దాడిచేసి పట్టుకున్నామన్నారు. పట్టుబడిన టిప్పర్లను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి తదుపరి చర్యల నిమిత్తం ఇన్‌చార్జ్ తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు అప్పగించినట్లు ఆమె పేర్కొన్నారు. దీనిపై వివరణ అడిగేందుకు ఫోన్‌లో సంప్రదించగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ స్పందించడం లేదు.

### వాహనాల తనిఖీ


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

వి.కోట: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ బాబు సూచించారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో సిబ్బందితో కలసి వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా విధించారు. ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే ప్రతి వాహనదారుడి వద్ద వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్స్ ఉండాలన్నారు.

### వైభవంగా విగ్రహ ప్రతిష్టాపన


హోమాలు చేస్తున్న వేదపండితులు

వి.కోట: పట్టణంలోని వినాయకనగర్‌లో వెలసిన సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి పునఃప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న పూజాకార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. బుధవారం ఉదయం వేదపారాయణంతో ప్రారంభమై ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

### స్థలం కేటాయించండి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

వి.కోట: హమాలీ కార్మికుల సమావేశం ఏర్పాటుకు ప్రత్యేకంగా కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని వి.కోట మేజర్ పంచాయతీ హమాలీ కార్మికులు సంఘం బుధవారం వినతిపత్రం ద్వారా తహసీల్దార్ పార్వతిని కోరారు. వారు మాట్లాడుతూ ప్రతి నిత్యం హమాలీ కార్మికులు ఉదయం 4 గంటలకే డ్యూటీల్లోకి రావాలని, వచ్చినప్పుడు పట్టణంలోని దుకాణాల ముందు పని గురించి చర్చించుకోవడానికి చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. తమకు ప్రభుత్వ స్థలాన్ని 3 సెంట్ల భూమిని కేటాయిస్తే, చందాల ద్వారా ఆఫీస్ రూమ్ం ఏర్పాటు చేసుకుని అక్కడ సమావేశమవుతామన్నారు. స్పందించిన తహసీల్దార్ సమస్యను పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. హమాలీ కార్మికులు తంగరాజ్, భాస్కర్ పాల్గొన్నారు.

### కొత్త చట్టాలు తీసుకురావాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహించే మహిళా వైద్యులు, సిబ్బందికి ప్రభుత్వం భద్రత కల్పించాలి. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన ఘటన దారుణం. పగలు, రాత్రి తేడా లేకుండా ప్రజలకు వైద్యం అందించే మాపై డాక్టర్లపైన దాడులు జరుగుతుంటే ఎలా సేవ చేయాలి, వైద్యం అందించాలి. కొత్త చట్టాలు తీసుకొచ్చి మహిళా వైద్యులకు ప్రత్యేక భద్రత కల్పించాలి. రాత్రుల్లో సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి.

-లహరి, వైద్యాధికారి, గంగవరం పీహెచ్‌సీ



### నిందితులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతా ట్రైనీ డాక్టర్‌పై అఘాయిత్యం దారుణం. వైద్యసేవలు అందించే వారిపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి. ఆస్పత్రుల్లో తగిన భద్రత ఉంటే ఏ సమయంలోనైనా వైద్యసేవలు నిర్భయంగా అందించే వీలుంటుంది. ఈ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.


-నరసమ్మ, స్టాఫ్‌నర్స్, చెరుకువారిపల్లె పీహెచ్‌సీ, సదుం

# డెంగీకి దివ్యౌషధం బొప్పాయి

- బొప్పాయి ఆకు రసంతో రక్త కణాల వృద్ధి
- ఆస్పత్రుల్లో డెంగీ జ్వరాల బాధితులు


పుంగనూరులో బొప్పాయి తోటలు

పుంగనూరు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటి వద్ద లభించే బొప్పాయి (పరింగ పండు) ఎన్నో ఔషధ గుణాలు కలిగి ఉంది. ముఖ్యంగా జ్వరం, కేన్సర్‌తో పాటు ఇతర రోగాలకు బొప్పాయ పండు, ఆకు రసం దివ్యౌషధంగా పనిచేస్తోంది. ప్రస్తుతం డెంగీ జ్వరాలతో బాధితులు ఆస్పత్రుల్లో క్యూ కడుతున్నారు. డెంగీ జ్వరంతో రక్తకణాలు తగ్గిపోవడం, ప్రజల ప్రాణాలు కోల్పోవడం జరుగుతోంది. డెంగీ ద్వారా తగ్గిన రక్తకణాలను వృద్ధి చేయడంలో బొప్పాయి పండు కీలకపాత్ర పోషిస్తోంది. డాక్టర్లు ప్రతిఒక్కరూ బొప్పాయ పండు తినాలి..రసం తాగాలి.. మంచినీరు ఎక్కువగా తాగండి.. ఇదే డెంగీకి వైద్యం అంటూ చెప్పడం గమనార్హం.



**డెంగీ ఇలా..**

ఇంటి వద్ద నీటి నిల్వలు, పాత వస్తువుల్లో నీరు చేరి ఈజిప్టి అనే దోమ వృద్ధి చెంది, ఇది మూడు అడుగుల ఎత్తు మాత్రమే ఎగరగలదు. అందువల్ల ఈదోమ శరీరంలోని కింది భాగాలను మాత్రమే కుడుతుంది. ఇది కుట్టిన వెంటనే అధిక జ్వరం, ఒళ్లు నొప్పులు, కడుపులో మంట, కళ్లు మంటలు, వాంతులు, చర్మంపై దద్దుర్లు, తలనొప్పి, ఆకలిలేక పోవడాన్ని డెంగీగా గుర్తిస్తారు. వారం రోజులపాటు జ్వరం పీడిస్తుంది. బొప్పాయతో పాటు అధికంగా నీరు తీసుకోవడం వలన జ్వరం తగ్గిపోతుంది. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో డెంగీని నివారించవచ్చు.

**బొప్పాయితో మందులు..**

ఫార్మా కంపెనీలు బొప్పాయి , ఆకులతో మందులు తయారు చేసి ఆస్పత్రులకు విక్రయిస్తున్నారు. చౌకగా లభించే బొప్పాయి , ఆకు కంపెనీల ద్వారా మందుల రూపంలో కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. అగోనిల్, క్యారిఫిల్, క్యారిపాయ, ప్లాటివిట్, మాత్రలు, సిరఫ్ మందులను విక్రయిస్తున్నారు.

**ఆకు రసంతో ప్రయోజనాలు...**

బొప్పాయి(పరింగపండు ) తినడం, వాటి ఆకులను చిన్నవిగా కత్తరించుకుని జ్యూస్ చేయాలి. లేదా నీటిలో ఉడకపెట్టి జ్యూస్ చేసుకోవచ్చు. రోజుకు రెండు సార్లు తాగాలి. ఒకొక్కసారి 20 మిల్లీలీటర్ల రసాన్ని తీసుకోవాలి. రసం రుచిగా ఉండేందుకు నిమ్మరసం, తేనె కలుపుకోవచ్చు. ఆకు రసంలో యాంటి ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండడంతో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. దీని ద్వారా జీర్ణ ప్రక్రియతో పాటు రక్తంలోని ప్లేట్‌లెట్లను వృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషిస్తుంది. కేన్సర్, అజీర్ణము, గ్యాస్, మలబద్ధకం, జలుబు, దగ్గు, జ్వరం, కీళ్లనొప్పులు, వాపులు వంటి రోగాలను నియంత్రిస్తుంది.

**బొప్పాయిలో విటమిన్లు..**

గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా లభించే బొప్పాయి పండులో విటమిన్ ఏ పుష్కలంగా ఉంటుంది. ఇది కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఎంతగానో ఉపయోగపడుతుంది. అలాగే ఫైబర్ ఎక్కువగా ఉండడంతో పండు కొద్దిగా తిన్నా కడుపు నిండినట్లు తెలుస్తుంది. దీని ద్వారా శరీర బరువు తగ్గడంతోపాటు కొవ్వు పదార్థాలు దూరమవుతాయి. అలాగే చక్కెర వ్యాధి ఉన్న వారికి ఆకు రసం, పండు ఎంతగానో ఉపయోగపడుతుంది. జీర్ణక్రియను పెంచడం, బరువును తగ్గించడంలో బొప్పాయి పండు ఉపయోగకారిగా నిలుస్తోంది.

**వైద్యుల సూచనల మేరకే వాడాలి..**



బొప్పాయి పండు, ఆకు రసం వైద్యులు సూచించిన మేరకే వినియోగించుకోవాలి. బొప్పాయి పండు తక్కువ మోతాదులో ప్రతిరోజూ తినడం, అధికంగా నీరు తాగడం మంచిది. కానీ ఆకు రసం తీసుకునే ముందు వైద్యుల సలహాలు తీసుకోవాలి. డెంగీ జ్వర బాధితులతో పాటు పలు వ్యాధులకు బొప్పాయ, ఆకురసం ఎంతో ఉపయోగపడుతుంది. దీనిని వినియోగించుకోవడం ఎంతో ఆరోగ్యకరం.

-డాక్టర్ చైతన్యతేజారెడ్డి, చిల్డ్రన్స్ స్పెషలిస్ట్, పుంగనూరు

### సుందరంగా ముఖద్వారం


సుందరంగా నిర్మిస్తున్న వెంకన్న ఆర్చి

పుంగనూరు: పట్టణంలోని పీఎల్ఆర్ మినీ బైపాస్ రోడ్డు గల తాటిమాకులపాళెం వద్ద శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి ఆర్చిని సుందరంగా ఏర్పాటు చేస్తున్నారు. స్వామివార్ల బొమ్మలతో 20 అడుగుల ఎత్తులో ఆర్చిని నిర్మించి, రంగులు వేసే కార్యక్రమం చేపట్టారు. కాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ ఆలయాన్ని టీటీడీలోకి విలీనం చేయించారు. అప్పటి నుంచి టీటీడీ ఆధ్వర్యంలో పూజలు, కైంకర్యాలు, ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆర్చి నిర్మాణంతో పట్టణంలో నూతన శోభ సంతరించుకుంది.

### పలమనేరు డీఎస్పీగా ప్రభాకర్


దేగల ప్రభాకర్

పలమనేరు: పలమనేరు డీఎస్పీగా దేగల ప్రభాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాజమండ్రి ఎస్‌బీ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడున్న విష్ణువీర్‌తేజ్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, సరిహద్దు ప్రాంతంలో అక్రమ వ్యాపారాలపై ప్రత్యేక దృష్టిని సారించనున్నట్టు తెలిపారు. ఆపై ఎస్పీ మణికంఠచందోలును చిత్తూరులో కలిసేందుకు ఆయన వెళ్లారు.

## తెలుగుభాషా పరిరక్షణకు నడుంబిగించాలి


అవార్డులు పొందిన చిన్నారులతో నిర్వాహకులు

పలమనేరు: తెలుగుభాషా పరిరక్షణకు నడుంబిగించాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథంనాయుడు తెలిపారు. స్థానిక కళామందిరంలో తెలుగు భాషాదినోత్సవాన్ని ముందస్తుగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, నీతిపద్యాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, గ్రంథాలు, జ్ఞాపికలను అందించారు. మరోవైపు తెలుగుభాష కోసం కృషిచేస్తున్న వారికి సన్మానం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలుగుభాషను రక్షించుకోవాల్సిన అవసరం నేటితరంపై ఉందన్నారు. ఇందుకోసం ముఖ్యంగా తల్లిదండ్రులు, సాహితీవేత్తలు కృషిచేయాలని కోరారు. సమితి కార్యదర్శి పుష్ప, మాధవరెడ్డి, ఆనంద బాబు, వెంకటేశు, చంద్రశేఖరయ్య, కళావతి, శ్రీరామచంద్రమూర్తి, శివశంకర్‌రెడ్డి, సుదర్శనాచారి, చైతన్య పాల్గొన్నారు.

### కుక్కల బెడదపై చర్యలు


మాట్లాడుతున్న కమిషనర్

పుంగనూరు: పట్టణంలోని వీధి కుక్కల బెడద, రోడ్లపై ఆవులు, పందుల విహారంపై చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. సాక్షిలో ఈనెల 27న కథనం ప్రచురించడంపై కమిషనర్ స్పందించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వీధి కుక్కలను పట్టుకుని తిరుపతిలోని అనిమల్ కేర్ సెంటర్‌కు తరలించి, కుటుంబ నియంత్రణ చేపడతామన్నారు. అలాగే పట్టణంలో ఆవులను వదిలివేయడంతో అవి ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, వీటిని యజమానులు తక్షణమే తమ ఇళ్లకు తీసుకెళ్లాలన్నారు. లేకుంటే వాటిని బంధించి పురపాలకశాఖ కార్యాలయంలో ఉంచి, సంబంధిత యజమానులకు జరిమానా విధించి ఆవులను వదిలిపెడుతామన్నారు. అలాగే పందులను ఇళ్ల వద్దనే ఉంచుకోవాలని లేకపోతే వాటిని బంధించి సుదూర ప్రాంతాల్లో వదిలేస్తామన్నారు. ఈ విషయమై పట్టణ ప్రజలు సహకరించాలని, ఆవులు, పందుల బెడద లేకుండా చూడాలని కోరారు.

## కూటమి నేతలకేనా ఉపాధి?


మాట్లాడుతున్న ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప

- మండల మీట్‌లో సభ్యుల ధ్వజం

బైరెడ్డిపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. మండలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ నేతలు ఉపాధి పథకంలో దోచుకుతింటున్నారని చప్పిడిపల్లె సర్పంచ్ విజయమ్మ ఆరోపించారు. కూటమి నేతలు యంత్రాలతో పనులు చేసి కూలీల కడుపుకొడుతున్నారని ధర్మపురి సర్పంచ్ బాలక్రిష్ణగౌడ్ మండిపడ్డారు. ఏపీఓ హరినాథ్ సమావేశంలో మండల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనుల వివరాలు, పనిచేస్తున్న కూలీల సంఖ్యను వివరిస్తుండగా ధర్మపురిలో 120 కూలీలు పనిచేశారని చెప్పడంతో ఎంపీటీసీ నాగరాజు కనీసం 10 మంది కూడా పనిచేయడం లేదని, కూలీలతో పనులు చేసినట్లు నిరూపించాలని పట్టుబడ్డాడు. దీంతో ఏపీఓ హరినాథ్ మౌనంగా ఉండిపోయాడు. తప్పుడు కూలీలు మస్టర్లల్లో నమోదు చేసి దండుకుంటున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధి హామీ ద్వారా కూలీలకు పనులు కల్పించాలని, రెండు నెలలుగా డిమాండ్ పెడుతున్నా అధికారులు పట్టించుకోలేదని సర్పంచులు రమణారెడ్డి, దేవేంద్రరెడ్డి, వెంకటేష్, రాజప్ప ఆరోపించారు. మండలంలో ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకున్నా 11 మంది ఫీల్డ్‌అసిస్టెంట్లను, ఏడుగురు సంఘమిత్రలను తొలగించడం న్యాయం కాదని సర్పంచ్ మమత అన్నారు. లక్కనపల్లె సచివాలయ కార్యదర్శి సుబ్రమణ్యం అభివృద్ధి పట్టించుకోకుండా టీడీపీ నేతలకే కొమ్ముకాస్తూ ప్రజలను నిర్లక్ష్యం చేస్తూ దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఎంపీటీసీ రేణుక పేర్కొన్నారు. కైగల్ సమీపంలో రైతుల స్వాధీనంలో ఉన్న పశువుల మేత బీడు భూములకు పట్టాలు మంజూరు చేయించాలని సర్పంచ్ ముంతాజ్‌బేగం చెప్పారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు ఓ పార్టీ నేతలకే ఒత్తాసు పలకడం న్యాయం కాదన్నారు. జగనన్న కాలనీల్లో నిర్మాణాలు చేపట్టాలని, బిల్లులు మంజూరు అవుతున్నాయన్నారు. రెవెన్యూ గ్రామ సదస్సులను, ఈ -పంట నమోదు కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జెడ్పీటీసీ ఆర్.కేశవులు, ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, డీటీ కిశోర్ పాల్గొన్నారు.

## విద్యార్థులు స్నేహభావంతో మెలగాలి


విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కుప్పంరూరల్: విద్యార్థులు స్నేహభావంతో మెలగాలని కుప్పం ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కుప్పం ఆర్టీసీ బస్టాండులో విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. విద్యార్థులు తోటివారితో స్నేహంగా ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. బస్సుల్లో ప్రయాణించే సమయంలో గొడవలు పడడం, ర్యాగింగ్ లాంటి చర్యలకు పాల్పడడం మంచిది కాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని తెలిపారు. తల్లిదండ్రులు ఎంతో ఉన్నతాశయంతో పాఠశాలలకు పంపుతారని, కష్టపడి చదివి వారి ఆశయాలు నెరవేర్చాలని సూచించారు.

### ట్రిపుల్ ఐటీకి బైరెడ్డిపల్లె విద్యార్థి


సంతోష్

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి సంతోష్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్ఎం నసీబ్‌జాన్ తెలిపారు. గత ఏడాదిలో సంతోష్ ఎన్‌సీసీ క్యాంపుల్లో చురుగ్గా పాల్గొనడం, 10వ తరగతిలో 563 మార్కులు సాధించడంతో ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థి ఎంపిక పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## వైఎస్సార్‌సీపీకి పనిచేశానని కరెంట్ కట్ చేస్తారట!

పలమనేరు: తాను వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా గత ఎన్నికల్లో పనిచేశానని కక్ష గట్టిన టీడీపీ నేతలు ఇంటి ముందు నిబంధనల మేరకు ఉన్న వాటర్‌ప్లాంట్‌ను ఎలాగైనా సీజ్ చేయాలనే దురుద్దేశంతో నీళ్లకుంటకు చెందిన కొందరు టీడీపీ నేతలు అధికారులను బెదిరించి కరెంట్ సర్వీసును తొలగించాలని చూస్తున్నారని మున్సిపాలిటీ పరిధిలోని నీళ్లకుంటకు చెందిన మణి(కె.సుబ్రమణ్యంరెడ్డి) ఆవేదన వ్యక్తం చేశారు. తాను మున్సిపాలిటీ బోరుకు కిలోమీటర్ దూరంలో ఉంటూ వాటర్‌ప్లాంట్‌కు సంబంధించి అన్ని అనుమతులున్నా తనపై కక్ష సాధిస్తున్నారని తెలిపారు. ఇందుకు సంబంధించి తాను ఇప్పటికే అన్ని ధ్రువపత్రాలను సంబంధిత అధికారులకు సమర్పించానన్నారు. కానీ టీడీపీ నేతలు కావాలనే తనను బెదిరిస్తున్నారని ఇందుకు సంబంధించిన అన్ని సాక్ష్యాధారాలు తన వద్దనున్నాయని తెలిపారు. మరోవైపు మున్సిపల్, ట్రాన్స్‌కో అధికారులు సైతం తామేం చేయలేమని టీడీపీ నాయకులు ప్రోద్బలంతో ఇవన్నీ చేస్తున్నారని విమర్శించారు. దీనిపై తనకు న్యాయం జరక్కుంటే ఏ ఒక్క అధికారిని వదలనని తెలిపారు.

### ఇసుక, మట్టి

# దోచుకో నా రాజా!


మొరంలో పచ్చ నేతల మట్టి అక్రమ రవాణా


ముసలిమడుగు వద్ద కౌండిన్యలో ఇసుక అక్రమాలు

- కౌండిన్యలో ఇసుక, చెరువుల్లో మట్టి ఖాళీ
- సర్వం దోచేస్తున్న చోటా పచ్చ లీడర్లు

పలమనేరు: ఇదే మంచి సమయం, ఇలాంటి చాన్స్ మళ్లీరాదు, ఆలసించిన ఆశాభంగం అన్నట్టు మళ్లీ అక్రమాలు చేయలేమోనని భయపడుతున్న టీడీపీ నేతలు దొరికింది దోచుకోవాలనే సూత్రాన్ని గట్టిగా నమ్ముతున్నట్టున్నారు. ఆమేరకు పలమనేరు మండలంలోని కౌండిన్య నదిలో నీళ్లు ఉన్నా, లేకున్నా ఎక్కడపడితే అక్కడ ఇసుకను తోడేస్తున్నారు. మరి కొందరు ఆపార్టీ నేతలు చెరువుల్లో మట్టిని జేసీబీలు పెట్టి మరీ తవ్వి పారేస్తున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మాత్రం తనకెందుకులే మా తమ్ముళ్లు సంపాదించుకోని అన్నట్టు వదిలేశారనే మాట ఆ పార్టీ శ్రేణుల్లోనే వినిపిస్తోంది. విషయం ఏంటంటే మండలంలోని ముసలిమడుగు వద్ద అక్కడికి చెందిన నలుగురు టీడీపీ నేతలు ఎలాగైనా ఈ ఐదేళ్లలో కోట్లు గడించాలని భారీగా పన్నాగం పన్నారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గతంలో వైఎస్సార్‌సీపీ పేరు చెప్పుకొని చేసిన అక్రమాలకంటే వందరెట్లు తాము చేస్తామంటూ రెచ్చిపోతున్నారు. అందులో భాగంగా అక్కడి కౌండిన్య నది నుంచి నిత్యం 50 ట్రాక్టర్ల ఇసుక కర్ణాటకకు చేరుతోంది. పెంగరగుంట పంచాయతీలో టీడీపీ శ్రేణుల ఇసుక అక్రమరవాణాపై సాధారణ ప్రజలు సైతం తీవ్రంగా విమర్శిస్తున్నారు.

**చెరువుల్లో మట్టి మాఫియా...**

ఇదే మండలంలోని మొరం గ్రామ సమీపంలోని చెరువుల్లో ఆ పంచాయతీకి చెందిన అక్కడి లోకల్ టీడీపీ లీడర్లు యథేచ్ఛగా మట్టిని తోలుకుంటున్నారు. మరికొందరు ఈజీఎస్ పనుల్లో అక్రమాలకు దిగినట్టు సమాచారం. కొందరు టీడీపీ చోటా నేతలు అక్కడి ఉపాధి కూలీలను ఏమార్చి వారి జాబ్‌కార్డులు, ఆధార్‌లను తీసుకొని అక్కడి ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా భారీగా అక్రమాలకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. బైరెడ్డిపల్లి మండలం చింతలగుంట ప్రాంతంలో ఇలాంటి అక్రమాలు ఇప్పుడు కూడా సర్వసాధారణమేననే విషయం వెలుగుచూస్తోంది. కొందరు డబుల్‌గేమ్ నేతలు రెండు ప్రభుత్వాల్లోనూ అక్రమాలు చేసినట్టు సమాచారం.

### ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్

నెల్లూరు(క్రైమ్): ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన దర్గామిట్టలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగింది. పుంగనూరు డిపోకు చెందిన ఇంద్ర బస్సు 20 మంది ప్రయాణికులతో మంగళవారం విజయవాడకు బయలుదేరింది. అర్ధరాత్రి దాటిన తర్వాత నెల్లూరు దర్గామిట్టకు వచ్చేసరికి ఎర్రమట్టి లోడుతో వెళ్తున్న టిప్పర్ మితిమీరిన వేగంతో యూటర్న్ తీసుకునే క్రమంలో బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సుడ్రైవర్ కుమార్‌తోపాటు ఫాలోయింగ్ డ్రైవర్ సైఫుల్లాఖాన్, క్లీనర్ ఆరీఫ్‌తోపాటు ప్రయాణికులు సిద్ధయ్యనాయుడు, నాగేశ్వరరావు, బాజీసింగ్‌కు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

## చోరీలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్ఐ నరేష్

శాంతిపురం: అంతర్రాష్ట్ర సరిహద్దుల్లోని శాంతిపురం మండలంలో దొంగతనాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కుప్పం రూరల్ సీఐ జె.మల్లేష్‌యాదవ్, రాళ్లబూదుగూరు ఎస్ఐ నగేష్ సూచించారు. బుధవారం వారు శాంతిపురంలో వ్యాపారుల అవగాహన సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. కుప్పం ప్రాంతంలో గత నెల రోజులుగా గుర్తుతెలియని వ్యక్తులు చోరీలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారని చెప్పారు. ప్రతి దుకాణంలో విధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్టు గమనిస్తే సత్వరం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు ముందుగా పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని చెప్పారు. మోటార్‌సైకిళ్ల చోరీలు పెరిగిన నేపథ్యంలో వాటిని నియంత్రించడానికి యజమానులు అప్రమత్తంగా వ్యవహరించాలని వారు కోరారు.